అని అన్నాడు. "ఈ రెండూ వచ్చాకే మనదేశంలోవాగుడు ఎక్కువైంది. ఇంత బలహీనంలోకి మనదేశం దిగిపోయింది" అన్నాడు సంగమయ్య.

యువకుడూ యువతీకూడా "ఏమండీ? అలా అంటారు. మాది వాగుడా? మాది బలహీనతా?" అన్నారు కొట్టొచ్చినట్టు.

"కాదు. ఒకళ్ళది గ్యాస్ ఒకళ్ళది హస్కు ఒకళ్ళది Soda gass Iron cylender ఒకళ్ళది Rice factory Sooty chimney" అన్నాడు సంగమయ్యలేచి వెళ్ళిపోతూ.

"వాడెవడో చాలా obsence గా మాట్లాడే లుచ్ఛాలాగున్నాడే." అంది యువతి. "కాదు వాడూ మా కోవకు చెందిన వాడే. Soda gass Iron cylender గాడే. తనతో హస్కుకొట్టేది దొరుకుతుందా అని చూస్తూవున్నవాడే" అని అన్నాడు యువకుడు. దూరంగా దరోఫీస్టీమరు ఫిబ్రవరి చీకట్లో స్త్రాండయి కూసింది. "బాగా కవిపెట్టేవు" అంది యువతి.

.... .... .... .... ....

## విడాకులు

"నిశితమైన బుద్ధి మొఱవోవడం ఎంతవానికైనా ఎప్పుడైనా కలుగుతుంది. అంతమాత్రానికి ఆలా "విడాకులు" ఇచ్చేసేటంత హడావడి చేస్తావెందుకు?" అన్నాడు. కూలివాని నెత్తిమీద నుంచి బజారుగంప దింపుతూ, కాలి జోడైనా వదలకుండా, పైమీది కండువాఅయినా తీసి కూర్మానికి తగిలించుకోకుండా—

పెనిమిటి వీరవెంకట విశ్వనాథ సుబ్రహ్మణ్యం పెండ్లాం లీలా మాధురితో. లీలామాధురి "ఏవీ? ఆకులు? విస్తరాకులేవీ? మాట్లాడితే విడాకులు విడాకులంటారు! ఏవీ? విస్తరాకులు? నిన్న సాయంత్రంనుంచి మొత్తుకుంటూవున్నాను. రేపొద్దున్న నాకు శనివారం అని-ఏవి చెప్పండి విస్తరాకులు!" అని గంపలో సరుకులు ఒకటొకటేతీసి అక్కడ పెడుతోంది నట్టింట. "ఓసి ఈ పద్దులో ఈ వస్తువు విస్తరాకులటే! దస్తూరి బోధ పడక ఏవస్తువో అనుకొని తీసికొనిరాలేదు." "దస్తూరీ మీరు వ్రాసికొన్నదే!" "అదే చెప్పొచ్చేమాట-నా దస్తూరీ నాకే తెలిసింది కాదు, ఆకాడకొచ్చేసరికి. అందుకే ప్రారంభంలోనే దేవిగారికి నివేదించుకున్నాను. ఎంతవానికైనా నిశితమైనబుద్ధి మొఱవ వోవడం ఎప్పుడైనా కలుగుతుందని"-"ఈ నివేదనల కేమొచ్చె! ఓకానీ ఇలా ఇవ్వండి" అంటూ భర్తకడనుండి ఓ కానీ పుచ్చుకొని ఆ యిల్లాలు "ఒరే! అబ్బీ! ఈ దగ్గఱి కొట్టుమీద ఓ కానీ కుట్టుడాకులు కానీకి ఏడో ఎనిమిదో ఇస్తారు లాగుంది తెచ్చిపెట్టు" అంది. వాడు ఆ కూలివాడు "కానీకి ఎనిమిదిస్తారండీ? అమ్మగారూ?" అన్నాడు, "ఎన్నిస్తే అన్నేపట్టుకురా" అంది. కూలివాడింకా ఏదో నసుకుతూ వెళ్ళ డానికి ఇష్టంకానివానిగా కనబడ్డాడు. "కాస్త ఊరగాయముక్క పెడతానులే వెళ్లు. త్వరగా తీసుకురా! ప్రతీపనికీ లంచం! కావాలి: పాటకపుముండావాళ్ళనుంచీ!" అని కానీ ఆ కూలి వాడికిస్తూ తాను చావట్లోనే చతికిలబడింది. "ఇక్కడ చతికిల బడ్డం ఎందుకు? వెళ్ళి ఆ వచ్చినసరుకులు వెంట వెంటనే సర్దు కోక" అన్నాడు వి. వి. వి. ఎస్.

"వాడు వి స్తరాకులట్టుకొచ్చాక అవికూడా పుచ్చుకు అన్నీ ఒకేపర్యాయం సర్దుకోవచ్చునని కూర్చున్నాను. నేనేం "రెస్టు" కోరుక్కూర్చోలేదు.'' అంటూ లీలామాధురి లేచి యింట్లోకి వెడుతూ వెడుతూ "వాడు వి స్తరాకులుతె స్తే మంచివో చెడ్డవో చూచి మరీపుచ్చుకోండి'' అని బుజంమీదుగా చూస్తూ వెనక్కు పూర్తిగా తిరిగి, మళ్ళీవచ్చింది. మళ్ళీవచ్చి "మీ మగాళ్ళ గడ్డాలుగీసికొనే నిరపాయపు మంగలికత్తులకు వాడితప్పితే తీసిపారేసి కొత్తవి తగిలించుకుంటారే ఆలా బుఱ్ఱ కాయలక్కూడా వాడిబీరోతే కొత్తవి తగిలించుకోవడానికి సాధనాలుంటే బాగుండిపోయేది. కాకపోతే చెప్పిన నాలుగు సరుకుల్లో మూడుమ్ముప్పాతిక మఱచిపోవడమే ఎప్పుడూను?" అంటూ ద్వారబంధాన్నిఅంటి నిలబడివుంది. వి. వి. వి. ఎస్. అక్కడే పడక్కుర్చీవుంటే అందులో ఆలా ఆసీనుడై, ప్రక్కనున్న చిన్న మేజాబల్లమీది ఓ పత్రిక తీసి తిలకిస్తూవున్నా డప్పటికప్పుడే. చదివీ వ్యాసం సమయస్ఫూర్తిగా వున్నట్టుతోచి భార్యకు వివరించేడు. "నీ వూహే మనోత్రోవను ఈ పత్రికాధిపతి వెల్లడించేడేవ్! ఇప్పుడే చదివేను. కాని వాడు నాకంటె దయగలవాడు. బుర్రలుతీసి కొత్తబుర్రలు తగిలించమనలేదు. బుర్రకో వారంరోజులు స్పిరుటూ ఆముదం రెండూకలిసి మర్ధనా చెయ్యమన్నాడు"—"ఆలాచేసేటట్టయితే ఎప్పట్లాబుద్ధి వికసిస్తుంది అని విస్పష్టంగా రాశాడా?" అని ప్రశ్నించింది గృహిణీలలామ—"విస్పష్టంగా రాశాడనే మనం అనుకోవాలి. సేఫ్టీరేజర్ బ్లేడ్సుకు ఆలాంటి ప్రక్రియగావిస్తే. పోయిన పదును మళ్ళావస్తుంది. అని వ్రాసినప్పుడు వాటినపేక్షించే

బుజ్జిలకుమాత్రం ఎందుకు వుపకరించదు ఆ ప్రక్రియ?" అన్నాడు వి. వి. వి. ఎస్.

అంతలో కూలివాడు అడ్డాకులైదు పట్టుకువచ్చి అక్కడ పెడుతూ "తమకోసం ఎవరో అమ్మగారు ఆవల నిలబడి వున్నారు? అయ్యోరా!" అన్నాడు. లీలా మాధురి "అమ్మ గారు!" అంటూ అటువైపు తొంగిచూచి—"వోరేవ్ కూలీ! నీవు రేపొద్దున్నేరా! మాగాయి పెడతా! మఱచిపోకు!" అంటూ సత్వరం వాణ్ణి పంపించేసి "రమ్మనమనండి ఎవరో? ఎందుకొచ్చారో? చందాకో? సరసానికో—నేనూవింటాను" అని లోస్వరంగా అంటూ తేబడ్డ కుట్టుడాకుల పుల్లలూడిపోతూ వుంటే వాటినలా తిరిగి దూరుస్తూ వీధివంక పరకాయిస్తూ "ఎవరమ్మా! రాండి: రావచ్చు! లోపలకు రాండి!" అంది.

ఆమె ఆ పరాయస్త్రీ పయిట సర్దుకుంటూ పైకేమనడానికి సంశయిస్తూ సంశయిస్తూ, లోపలకువచ్చి అలాగోడవద్ద నిలబడి తూష్టిమవహించి, భావం లోలోనే బరువెక్కి నిల్పోపలేనట్లు, అసలు అక్కడుండలేనట్టు "పోనీలెండి!" అంటూ వీధిలోనికి వెళ్ళిపోయింది.

"అదేమిటమ్మా! వచ్చి ఎందుకొచ్చావో తెలియచెప్ప కుండా వెళ్ళిపోవడం మఱీ అసందర్భం! ఈవిడ మా ఆవిడే! రాండి!" అన్నాడు వి. వి. వి. ఎస్.

ఆమె అవతలనుంచి మళ్ళీ లోపలకువస్తూ "ఇంతకూ పావులాలెండి అది. దానికోసం మిమ్మల్ని అడగడమా!" అని ఆలోచిస్తూవున్నాను. నాలో నేనే ఆలోచించుకుంటూ వున్నాను" అంది.—"ఏం మీ దగ్గర ఈయన బదులుచ్చు

కున్నారా ?" "బదులుచ్చుకోవడం కాదండమ్మా !" "దొంగి లించారా ?" "ఆఁ అంతమాటంటానా ?"

ఆలా అక్కడివున్న స్త్రీలకిద్దరకూ అన్యోన్యంమాట వెంబడి మాట ఎదో మరిమరీవస్తూవుంటే, వి. వి. వి. ఎస్. కుర్చీలోవాడు కుర్చీలో ఇటున్నవాడు అటూ, అటున్నవాడుఇటూ, వైపులు మారుతూ, చొక్కా సవరించుకొంటూ, కండువాతీసేసు కొంటూ, "ఏమిటా అర్ధ అర్ధరూపాయ ? ఆమె ఎవరా ?" అని తనకు అర్ధంకాక ఊరికే బుఱ్ఱతడుముకుంటూ, కొనగోళ్ళలో క్రాప్ సరిచేసుకుంటూ "నే సరుకులుకొన్న కొట్టుదగ్గర, ఇప్పుడు నేను సరుకులు కొన్న కొట్టుదగ్గర ఇప్పుడు ఇవాళ సరుకులు కొనడంగాక ఇదివఱ కెప్పుడైనా సరుకులుకొన్నారా ?" అని అడిగాడు "అబ్బే ! లేదండీ ! ఈవేళేనండీ !" "మీరేనా కొన్నది ?" "అవునండీ నాదేనండీ పడిపోయింది." "ఆయన కొన్నది అంటూవుంటే మీరు పడిపోయిందంటారేమిటమ్మా ! ఇదెక్కడి...." అను అర్ధోక్తితో నోరునొక్కుకుంది లీలా మాధురి. "అవునండి! నాదేనండి ! పాపులా తూలిపడిపోయింది." "ఎక్కడ ?" అని అడిగాడు వి. వి. వి. ఎస్ కొత్తావిడ కళ్ళ కేసిచూస్తూ.

ఆమెకళ్ళకు ముక్కద్దాలున్నాయి. "కళ్ళకూ ముక్కుకూ ఏమీలేకపోయినా చీరనుబట్టి ఆరాతియ్యొచ్చు నామెను" అని ఊహించేడు వి. వి. వి. ఎస్. ఆలా భర్తఅనుకొనే సావ కాశంలో భార్య "మీరు స్వయంగా బజారు చేసుకోగలరన్న మాట !" అని సవాలేసింది లీలామాధురి. "చేసుకోగలనేమి టమ్మా ! ఇక్కడకు ఏడేళ్ళనుంచి చేసుకొంటూవుంటేను. కాని

టొక్కనాడూ చిల్లిగవ్వ చేతిలోంచి జారిపోలే!" అంది ఆ వింతవెలది.

"అయితే యిప్పుడేమిటంటారు?" అంటూ తనపంచి కుచ్చెళ్ళలాదులిపాడు వి. వి. వి. ఎస్. "ఏమిటండీ! అలా దులుపుకుంటారు పంచి? మీ పంచిలోకి తూలిపడిందనా ఆమె పావులా బాగుందివరస...."....వి. వి. వి. ఎస్ "మరి ఆమె లోకమంతా విడిచిపెట్టి ఇక్కడకు రావడంలో అర్థం ఏమి టంటావు?" "నేను లోకమంతా విడిచిపెట్టి ఆ కూలీముండా కొడుకుచేత విస్తరంటలు తెప్పించడంలో ఎంతఅర్థముందో అంతేఅర్థం ఆమె ఇక్కడకు రావడంలోనూ" అంది లీలా మాధురి.

"అంతే అవితే ఆవిణ్ణి వెళ్ళిపొమ్మనిచెప్పు! చెప్పి దలుపువేసేసెయ్యి!" అన్నాడు వి. వి. వి. ఎస్ భార్యతో. కొత్తామె—వి. వి. వి. ఎస్ ఎప్పుడైతే పంచదులిపి తననిర్దో షిత్వం నిరూపించాడో మఱి తన పావులానుగురించి ఆశవదలు కొని "వెడతానమ్మా! వెడతానండీ!" అంది. దంపతులు ఎనైడ్లోపడేలా. "పాపం! నాచేత బజార్లో పంచెదులిపించడం ఇష్టంలేక ఇంతదూరం వెన్నంటి యిలావచ్చింది అనుకుంటాను. మగాడంటే ఆడదానికి అంతగౌరవం వుండాలి!" అన్నాడు వి. వి. వి. ఎస్. అంటూ తనకాళ్ళనున్న బూట్సు జోడాలో ఓదాన్ని కాలుచాచి అలా తాళ్ళువదిలిచ్చేలా వూపాడు. జోడు చివర బాగాచిరిగి అరిగివున్న సందులోనుంచి ఏదో....ఏదోవెలు వడి....యివలకుపడింది. ఏదోవెలువడి చప్పుడయ్యేలో "పావులా కోసం చూడండి ఆవిడ అష్టకష్టాలూపడి మీ పాదాలదగ్గఱకు

డేక్కుంటూ వచ్చింది. డబ్బంటే అంత మోజువుండాలని యీరోజు నుంచైనా నేర్చుకోండి " అంది లీలామాధురి.

కొత్తామె వెనక్కు తిరిగి చూచింది. ఆమెకళ్ళల్లోకి నేల మీద పడ్డ పావులాకాసు మెఱసింది. ఆమె పైకెత్తుతూ " మీ బూడ్సుకు చిల్లున్నట్టుందండీ ! సార్ ! అందులోంచి వూడి పడింది. ఇదిగో పావులా ! థాంక్సు ! ఇదే నా పావులా ! ఈ పావులా ఇప్పుడు దొఱక్కపోతే రేతిరల్లా టీ పోతే అయి పోయివుండేది. ఎక్కవుంటు బొక్కుమీద " అని పైకనేమాట పైకంటూ లోపలనుకొనేమాట లోపలనుకొంటూ వెళ్ళిపోయింది ఆమె. వెళ్ళిపోతూవున్న ఆమెను వెనక్కు చూడచేస్తూ వి. వి. వి. ఎస్ " షియర్ ఏక్సిడెంట్సు, చూచారా ! ఇలాగే వుంటాయి ! మీరనుకొన్నారా ? లేదు. నేననుకొన్నానా ? లేదు. మీ పావులాతూలి నా బూడ్సులో పడ్డంఅనేది షియర్ ఏక్సి డెంటు !" అన్నాడు. ఆమె " టు-ఎర్ ' నీ-హ్యూమన్ " అంటూ వీధుచ్చుకుంది.

లీలామాధురి మిక్కిలి చిన్నబుచ్చుకున్నట్టు పైకితేల కుండా " ఈ వెధవాకులుకంటె ఆ వెధవ " విడాకు " లట్టుకొస్తే వదలిపోయేది. అంతా వూడూదుపుల్లే !" అంది. వి. వి. వి. ఎస్. " విడాకుల్లో అంటాకు శ్రేష్టం—నూగుండదు—పోగుండదు— నాచుండదు—నత్తుండదు — గుడ్డుండదు — జిడ్డుండదు—" అంటూ వంటత్వరగా కానిమ్మన్నాడు.

.... .... .... .... ....